క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపకులపతి ఇ.సాయిబాబా రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణ

రాజంపేట : ఇటీవల నంద్యాలలోని ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జాతీయ స్థాయి సాంకేతిక, నిర్వహణ, సాంస్కృతిక ఉత్సవం దిలానా 2కె25లో బోయనపల్లిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ డేటా సైన్స్ (ఏఐ అండ్ డీఎస్) ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కె.చంద్ర వంశీ, బి.జాకీర్ హుస్సేన్, ఐ.మహేశ్వర్ రెడ్డి, వి.అంకయ్య, బి.జయ ప్రకాష్‌లు టెక్నికల్ క్విజ్ పోటీలో ప్రథమ బహుమతి, పోస్టర్ ప్రజెంటేషన్‌లో ద్వితీయ బహుమతిని సాధించడం జరిగిందని విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఈ సాయిబాబా రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో కలసి ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

ఘనంగా ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందుకు హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, ముస్లిం మైనార్టీలు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని అనంతరాజుపేట గ్రామంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ షఫీ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముఖ్య అతిథిగా వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ మాట్లాడుతూ ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మత సామరస్యంతో పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. ఇఫ్తార్ విందులో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లె మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, బండారు మల్లికార్జున, ఆర్వీ రమణ, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

పుల్లంపేట : మండలంలోని వత్తలూరు పంచాయతీలోని సర్వేనెంబరు – 500లో లేబాకువారిపల్లి హరిజనవాడకు చెందిన ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకున్నారని మంగళవారం తహసీల్దార్ అరవింద కిషోర్‌కు ఎంఆర్‌పీఎస్ నాయకులు గోపి, గ్రామ ప్రజలు ఫిర్యాదు చేశారు. తమ గ్రామంలో చావిడికి సంబంధించిన భూమిని ఆక్రమించుకున్నారని, తక్షణమే వారిపై చర్యలు తీసుకొని భూమిని స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.

బాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తాతయ్య



రాయచోటి అర్బన్ : భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాయచోటికి చెందిన పల్లం తాతయ్య ఎంపికయ్యారు. గుంటూరు సింధూరి హోటల్‌లో బాస్ రాష్ట్ర కార్యవర్గం సమావేశం ఆదివారం జరిగింది. బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో బాస్ కేంద్ర కమిటీ ప్రతినిధులు దుర్గం సుబ్బారావు, కె.వి.రమణల పర్యవేక్షణలో సంఘం రాష్ట్రనూతన కమిటీ ఎంపిక కార్యక్రమం జరిగింది. పల్లం తాతయ్యను సంఘం నేతలు, సభ్యులంతా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు మంగళవారం ఇక్కడి విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా సామాజిక ఉద్యమాల్లో పనిచేస్తున్న తనను రాష్ట్ర కార్యదర్శి పదవికి ఎంపికచేయడం సంతోషంగా ఉందన్నారు. తన బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు.

వైద్య సేవలు సకాలంలో అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ లోకవర్ధన్

తంబళ్లపల్లె : గ్రామీణ ప్రాంత ప్రజలకు 108,104 వాహన వైద్య సేవలు సకాలంలో అందించేందుకు కృషి చేయాలని ఎన్టీఆర్ వైద్యసేవల జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ తెలిపారు. మంగళవారం ఆయన సీహెచ్‌సీలో ఎన్టీఆర్ వైద్య సేవ విభాగాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. వైద్య సేవలు గురించి ఆరోగ్యమిత్ర శ్రీలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. 108 వాహనం పరిశీలించారు ప్రజలకు 108 వాహన సేవలు అందుతున్న సేవలపై ఈఎంటీ అనురాధ, పైలెట్ రెడ్డిప్రసాద్‌లను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో స్పందించి వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు.

‘ఉపాధి’లో కమీషన్ల కహానీ!

- పారదర్శకంగా చేయాల్సిన చోట సోషల్ ఆడిట్ బృందం చేతివాటం
- రూ.లక్ష విలువైన పనులకు రూ.2 వేల వరకు వసూలు
- ఇవ్వకుంటే తప్పులు చూపి సిబ్బందిపై చర్యలకు సిఫారసు
- అవస్థలు పడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అధికారులు (పాత చిత్రం)



ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారులు (పాత చిత్రం)

గాలివీడు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (మన్‌రేగా) పనుల్లో జరిగే అక్రమాలు గుర్తించడంలో సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) బృందాలది కీలక పాత్ర. లేని కూలీల పేరుతో వేతనాలు కాజేసినా.. తప్పుడు హాజరుతో అక్రమాలకు పాల్పడినా.. తక్కువ విస్తీర్ణంలో చేసిన పనిని ఎక్కువగా చూపి నిధులు నొక్కేసినా ఈ సామాజిక తనిఖీ బృందాలు గుర్తించి తగిన చర్యలకు సిఫారసు చేస్తాయి. కానీ కంచే చేను మేసినట్లుగా తనిఖీ బృందాల్లోని కొందరు అవకతవకలకు పాల్పడుతున్నారు. తనిఖీల పేరుతో ఒక్కో పంచాయతీలో అక్కడ చేసిన పనుల విలువ ఆధారంగా గరిష్ఠంగా 2 శాతం వరకు క్షేత్ర స్థాయి సిబ్బంది నుంచి అక్రమంగా వసూలు చేస్తున్నారు. అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో వీరి ఆగడాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఉపాధి హామీ పథకం కింద 2023 – 24 సంవత్సరానికి గాను గాలివీడు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో రూ.11 కోట్లు పనులు జరిగాయి. ఈ నిధుల వినియోగంతో పాటు పనుల్లో పారదర్శకతకు ప్రతి పంచాయతీలోనూ సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలోని సామాజిక తనిఖీలు, జవాబుదారీతనం, పారదర్శకత సంస్థ (ఎస్ఎస్ఏటీ) పనిచేస్తోంది. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ఆయా పంచాయతీల పరిధిలో జరిగిన ఉపాధి పనులను ఈ సంస్థ సిబ్బంది తనిఖీ చేసి లోపాలు, అవకతవకలు గుర్తిస్తారు. అక్రమాలు గుర్తిస్తే బాధ్యులైన క్షేత్రస్థాయి సిబ్బందిపై చర్యలకు సిఫార్సు చేస్తారు.

బాహాటంగానే వసూళ్లు

గతంలో సామాజిక తనిఖీలకు వెళ్లేప్పుడు క్షేత్రస్థాయి సిబ్బంది భోజనం ఏర్పాటు చేసినా ఎస్ఎస్ఏటీ సిబ్బంది తిరస్కరించేవారు. తామే సొంతంగా వసతి ఏర్పాట్లు చేసుకునేవారు. కానీ గత నాలుగేళ్లుగా తనిఖీ సిబ్బందిలో విచ్చలవిడితనం పెరిగిపోయింది. తమకు వసతి, భోజన సదుపాయం కల్పించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి నిర్దేశిస్తున్నారు. పనులను తనిఖీ చేసి బహిరంగంగానే కమీషన్లు తీసుకుంటున్నారు. రూ. లక్ష విలువైన పనికి రూ.2 వేలు చొప్పున ఇవ్వాల్సిందేనని ఫీల్డ్ అసిస్టెంట్లను డిమాండ్ చేస్తున్నారు. దాదాపు అన్ని చోట్ల ఇదే పరిస్థితి ఉంది.

కమీషన్లు ముట్టజెప్పకుంటే చుక్కలే

తాము అడిగిన మేరకు కమీషన్లు ఇచ్చినచోట ఉపాధి పనుల లోపాలపై పెద్దగా దృష్టి సారించడం లేదు. తూతూమంత్రంగా తనిఖీలతో సరిపెడుతున్నారు. అధికారులకు అనుమానం రాకుండా ఒకటి, రెండు పనుల్లో చిన్నచిన్న లోపాలున్నట్లు చూపించి మమ అనిపిస్తున్నారు. డబ్బులివ్వని ఫీల్డ్ అసిస్టెంట్లకు మాత్రం తనిఖీల పేరుతో చుక్కలు చూపిస్తున్నారు. కూలీల మస్టర్లలో దిద్దుబాట్లు ఉన్నాయని.. తక్కువ చేస్తే ఎక్కువగా చూపించారని తప్పుడు నివేదికలు రాస్తున్నారు. తప్పనిసరిగా నిర్వహించాల్సిన ఏడు రికార్డులు అందుబాటులో లేవంటూ క్షేత్రస్థాయి సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నారు.

హాజరులో మాయాజాలం

సామాజిక తనిఖీ బృందాల బెడద పడలేక ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పనిసరి పరిస్థితుల్లో వారికి కమీషన్లు ముట్టజెప్పాల్సిన పరిస్థితులను తీసుకొస్తున్నారు. సోషల్ ఆడిట్ బృందం చిన్న పంచాయతీల్లో రూ. వేలల్లో, పెద్ద పంచాయతీల్లో రూ. లక్షల్లో అందుకుంటున్నట్లు తెలుస్తోంది. అలా ఇచ్చిన సొమ్మును తిరిగి సంపాదించుకోడానికి కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. పర్యవసానంగా కూలీల హాజరు వ్యవహారంలో గోల్‌మాల్ జరుగుతోంది. ఉదాహరణకు ఒక బృందంలో ఇద్దరు, ముగ్గురు కూలీలు రాకపోయినా హాజరైనట్లు నమోదు చేస్తున్నారు. ఇలా కూలీల బ్యాంకు ఖాతాలకు జమయ్యే వేతనాల నుంచి కొంత మొత్తం తీసుకుంటున్నారు. ప్రతి కూలీకి రూ.300 కనీస వేతనం తప్పనిసరిగా వచ్చేలా చూడాలని గ్రామీణాభివృద్ధిశాఖ ఆదేశాలున్నాయి. దీన్ని తమకు అనుగుణంగా మార్చుకుని కొందరు సిబ్బంది కూలీలతో తక్కువ విస్తీర్ణంలో పనులు చేయించి ఎక్కువ పని చేసినట్లు నమోదు చేయిస్తున్నారు. బదులుగా ఒక్కో కూలీ వేతనాల నుంచి వారానికి రూ.200 వరకు వసూలు చేస్తున్నారు. ఇలా తీసుకుంటున్న మొత్తాల నుంచే తనిఖీ బృందాలకు మామూళ్లు సమర్పించుకుంటున్నామని ఓ ఫీల్డ్ అసిస్టెంట్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ఎంపీడీఓ వివరణ

ఈ విషయమై ఎంపీడీఓ జవహర్ బాబును వివరణ కోరగా ఆయన స్పందిస్తూ ఉపాధి పనుల సామాజిక తనిఖీలో కొందరు మామూలు అడుగుతున్నారన్న విషయం తమ దృష్టి రాలేదన్నారు. ఇలాంటి వ్యవహారాలు జరిగినట్లు సమాచారం ఇస్తే ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు.

నేడు వీరభద్రుడి ఆలయంలో అన్నమయ్య వర్ధంతి

రాయచోటి టౌన్ : నేడు శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో పదకవితా పితామహుడు శ్రీ అన్నమాచార్యుల వారి వర్ధంతి వేడుకలు నిర్వహించనున్నట్లు రేడియో గాయకుడు తుమ్మల హరినాథ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాకారులు, భక్తులతో కలసి చెక్క భజనలు, తాళం భజనలతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు హార్మోనిస్టు జిల్లెల మహదేవ, తబలా రేడియో ఆర్టిస్టు నరసింహా శర్మ, డప్పు మాస్టర్ వట్టికాళ్ల వెంకటరమణ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లా, అన్నమయ్య జిల్లాలోని కళాకారులు పాల్గొనాలని కోరారు.

పన్ను బకాయిల చెల్లింపులో రాయితీ

రాయచోటి అర్బన్ : ఇంటిపన్ను బకాయిల వడ్డీపై 50 శాతం మినహాయింపును ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణంగా ఇంటి, ఖాళీ జాగా పన్నులను సకాలంలో చెల్లించకపోతే (మొదటి అర్ధ సంవత్సరం జూన్ చివరి వరకు, రెండవ అర్ధ సంవత్సరం డిసెంబర్ చివరి వరకు) 2 శాతం వడ్డీని ప్రభుత్వం విధిస్తుంది. కాగా పన్ను బకాయిల వసూలును మెరుగుపర్చేందుకు, పన్ను చెల్లింపుదారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వడ్డీపై 50 శాతం రాయితీ మినహాయింపును ఇస్తోందన్నారు. గత ఆర్థిక సంవత్సరం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బకాయిలు కలిపి ఒకేసారి మార్చి 31వ తేదీలోపు చెల్లిస్తే వడ్డీపై 50 రాయితీ అందివ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పన్ను బకాయిదారులంతా వినియోగించుకుని పురపాలక సంఘం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నవోదయ ఫలితాల్లో రాణించిన విద్యార్థులు



కాశిగారి తేజేష్



సౌమ్యశ్రీ

రాయచోటి జగదాంబసెంటర్ : జవహర్ నవోదయ పరీక్షా ఫలితాలలో రాయచోటి పట్టణంలోని మురళి కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు కరెస్పాండెంట్ సరితాదేవి, ప్రిన్సిపల్ లక్ష్మీప్రియలు తెలిపారు. నితిన్, రాకేష్‌లు రాష్ట్రీయ మిలిటరీ స్కూల్‌కు అర్హత సాధించగా తాజాగా మంగళవారం విడుదలైన జవహర్ నవోదయ పాఠశాల ప్రవేశ పరీక్షా ఫలితాలలో ప్రభంజనం సృష్టిస్తూ మొదటి రౌండ్‌లో చర్విత, మిథున్ వైభవ్‌రెడ్డి, రాఘవేంద్ర, దిలీప్‌గౌడ్, నితిన్, శ్రీతన్య, దక్షత్, ఖ్యాతి, కార్తికేయలు నవోదయ పాఠశాల ప్రవేశానికి అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, కోచింగ్ సెంటర్ గౌరవ సలహాదారులు పివి నాగయ్య అభినందించారు.

మార్గోపల్లి విద్యార్థిని ఎంపిక

చిట్వేలి : మండల పరిధిలోని మార్గోపల్లి ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న సజ్జల సౌమ్యశ్రీ నవోదయకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ప్రసన్న కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరిలో రైల్వేకోడూరు పరీక్షా కేంద్రంలో సౌమ్యశ్రీ పరీక్ష రాయగా మంగళవారం వెలువడిన ఫలితాలలో నవోదయకు ఎంపికైనట్లు చెప్పారు. మార్గోపల్లి పాఠశాల నుంచి తొలిసారి నవోదయకు ఎంపిక కావడంపట్ల గ్రామస్తులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తీర్ణత సాధించిన తేజేష్

సిద్దవటం : మండలంలోని మోదీన్‌సాబ్‌పల్లె గ్రామానికి చెందిన కాశిగారి శ్రీనివాసప్రసాద్ కుమారుడు కాశిగారి తేజేష్ అనే విద్యార్థి జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవరి 18వ తేదీన జవహర్ నవోదయ పాఠశాలకు 6వ తరగతి ప్రవేశాలకు ప్రవేశ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలో తేజేష్ ఉత్తీర్ణత సాధించి నవోదయ పాఠశాలలో సీటుకు ఎంపికైయ్యారు. తేజేష్ మాధవరం ఏవీఎస్ పాఠశాలలో చదివారని పాఠశాల ఉపాధ్యాయులకు తేజేష్ తండ్రి శ్రీనివాసప్రసాద్ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రైతులు యాజమాన్య పద్ధతులు అవలంబించాలి



సబ్సిడీ పురుగుల మందులను అందజేస్తున్న ఏడీఏ

సిద్దవటం : రైతులు పంటల సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులను అవలంబించాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని బొగ్గిడివారిపల్లె రైతు సేవా కేంద్రం పరిధిలోని నేకనాపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ నాగరాజ మాట్లాడుతూ నువ్వుల పంటకు సంబంధించి రైతులకు సాంకేతిక సూచనలు, సలహాలు అందజేయడం జరిగిందన్నారు. అలాగే జాతీయ ఆహార భద్రత మిషన్ ఫర్ ఎడిబుల్ ఆయిల్స్, ఆయిల్ సీడ్స్ అనే పథకంపై రైతులకు శిక్షణను ఏర్పాటు చేసి రైతులకు 50 శాతం సబ్సిడీ పైన పురుగుల మందులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. రైతులు నూతన సాంకేతిక పద్ధతులను అవలంబించాలన్నారు. సస్య రక్షణ చర్యల్లో క్రమం తప్పకుండా సకాలంలో విత్తన శుద్ధిని తప్పకుండా చేయాలన్నారు. రసం పీల్చు పురుగుల నివారణకు తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. వేసవిలో నీటి వసతి ఉన్న చోట పెసర, మినుముల వంటి పంటలను సాగుచేయాలన్నారు. అలాగే ఆకుకూరలు, కూరగాయల పంటలపై మొగ్గు చూపాలని రైతులకు వివరించామని ఆయన అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు ప్రేమ్ సందీప్, శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యలో పశువుల పాక

- ఇబ్బందులు పడుతున్నామంటూ పంచాయతీ కార్యదర్శికి స్థానికుల ఫిర్యాదు



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న మనోరంజన్ కాలనీ వాసులు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మనోరంజన్ నగర్ ప్రాంత ప్రజలు ఇళ్ల మధ్య ఉన్న పశువుల పాకతో పలు రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మంగళవారం పంచాయతీ కార్యదర్శి సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము నివాసం ఉంటున్న ప్రాంతాలలో తుంగ శ్రీనివాసులు అనే వ్యక్తికి చెందిన సుమారు 60కి పైగా ఎనుములు, ఆవులను పోషిస్తున్నాడన్నారు. పశువులు విసర్జించిన వ్యర్థాలను తన స్థలంలో కాకుండా తమ ఇళ్ల స్థలాల్లోకి దారి మళ్లిస్తున్నాడని దీంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యర్థాలను తన స్థలంలోనే గొయ్యి తీసి అందులోకి పంపించాలని స్థానికులు కోరితే మీరెవ్వరు నాకు చెప్పడానికి నాకు నచ్చిన చోటికి వదులుకుంటానని బెదిరింపులకు దిగారని, నిత్యం పశువులు పాకను నీళ్లతో శుభ్రం చేసి ఆ నీటిని తమ ఇళ్ల వైపు మళ్లించడం ఎంతవరకు సబబు అని వారు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కల్గించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మొదటగా పంచాయతీ కార్యాలయం నుంచి నోటీసులు పంపించి సమాధానం తీసుకున్న తరువాత ఈ విషయంపై తప్పకుండా ప్రజలకు ఆమోదయోగ్యమైన సమాధానాన్ని ఇస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మనోరంజనీ కాలనీ వాసులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం మంజూరు చేయండి



తహసీల్దారుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న రాజానాయుడు

సిద్దవటం : మండలంలోని కమ్మపాలెం ఎస్టీ కాలనీ వాసులకు దహన సంస్కారాల నిమిత్తం శ్మశాన స్థలం మంజూరు చేయాలని టీడీపీ నాయకుడు రాజానాయుడు మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దారుకు వినతి పత్రాన్ని అందజేశారు. కమ్మపాలెం ఎస్టీ కాలనీ వాసులకు గత కొన్నేళ్లుగా శ్మశాన స్థలం లేక అవస్థలు పడుతున్నారని వారికి శ్మశానానికి స్థలం కేటాయించాలని రాజానాయుడు తెలపండంతో ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత స్పందించి జంగాలపల్లె రెవెన్యూ గ్రామంలో సర్వేనెంబర్ 207,1/బిలోని ప్రభుత్వ స్థలంలో శ్మశానానికి స్థలం కేటాయించడానికి స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ, సర్వేయర్, స్థానికులు అయ్యప్పనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మా పొలాలకు దారి చూపండి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

పెనగలూరు : మా పొలాలకు వెళ్లే దారిని మూసివేశారని వెంటనే తమకు దారి చూపాలని కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతులు తహసీల్దార్ అమరేశ్వర్‌కు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. గత 50 సంవత్సరాలుగా ఈ దారిన మా పొలాలకు వెళ్తూ పొలం పనులు చేసుకునే వారమన్నారు. గీత అనే మహిళ ఈ దారిలో రైతులను పోనివ్వకుండా కంచె వేసిందని తహసీల్దార్‌కు విన్నవించారు. ఈ దారిని మూసివేయడంతో కనీసం గేదెలకు గడ్డి తెచ్చుకునేందుకు కూడా అవకాశం లేదని, కావున వెంటనే దారి సౌకర్యం కల్పించాలని వారు తహసీల్దార్‌ను కోరాగా స్పందించిన ఆమె వీఆర్‌ఓ, సర్వేయర్, గ్రామ సేవకులను పంపి సర్వే చేసి దారిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

సమాజ వ్యతిరేక కార్యకలాపాలపై సమాచారమివ్వండి



మహిళా పోలీసుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కుళ్లాయప్ప

రాజంపేట : మహిళా పోలీసులు బాధ్యతయుతంగా మెలగాలని మన్నూరు సీఐ కుళ్లాయప్ప అన్నారు. మంగళవారం మన్నూరు సర్కిల్ కార్యాలయంలో మహిళా పోలీసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. తమ పరిధిలో సైబర్ నేరాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే తెలియచేయాలన్నారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించి అరికట్టేలా చూడాలన్నారు. మహిళలకు పోలీసుపరంగా సాయం చేసే విషయంలో ముందుంజలో ఉండాలన్నారు. సమాజ వ్యతిరేక కార్యకలాపాల గురించి తెలిసిన వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

ఏప్రిల్ 2 నుంచి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు



వత్తలూరులో నూతనంగా నిర్మించిన రామాలయం

పుల్లంపేట : మండలంలోని వత్తలూరులో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఏప్రిల్ 2వ తేదీ నుంచి మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం విలేకరులకు తెలిపారు. అందులో భాగంగా 2వ తేదీ ఉదయం ప్రత్యేక పూజ, హోమకార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 3వ తేదీ ఉదయం మూలమంత్ర జపములు, నవగ్రహ జపములు, దీక్షాహవం, సాయంత్రం అష్టోత్తర శత దీపాలంకరణసేవ, వేదపారాయణం, శయ్యాదివాసం, పుష్పాదివాసం, మంత్రపుష్పం కార్యక్రమాలు జరుపనున్నట్లు పేర్కొన్నారు. 4వ తేదీ ఉదయం 9:20 గంటల నుంచి సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కల్యాణం అనంతరం కల్యాణ ఉత్సవ మూర్తులు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు.

ఎండల పట్ల జాగ్రత్త వహించాలి



దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మందులు అందజేస్తున్న వైద్యాధికారిణి డాక్టర్ శ్రీవిద్య

సిద్దవటం : ప్రస్తుతం ఎండలు తీవ్రంగా కాస్తున్నాయని ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించి తగు చర్యలు తీసుకోవాలని 104 వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య తెలిపారు. సిద్దవటం మండలంలోని నిర్మలగిరి కాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన 104 వైద్య సేవల్లో భాగంగా డాక్టర్ శ్రీవిద్య వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా మంచినీరు, మజ్జిగ, కొబ్బరి బోండాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఎండలో ఎవరూ తిరగవద్దన్నారు. ఏదైనా పనులు ఉంటే ఉదయం 6 గంటల నుంచి 11 గంటలలోపు పనులు ముగించుకుని ఇండ్లకు వెళ్లాలన్నారు. ఆరోగ్య సమస్యలు ఏవైనా ఉంటే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం పొందాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రిలకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దని ఆమె అన్నారు. అనంతరం ఆమె దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు సరిపడా మందులను అందజేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పవన్‌కల్యాణ్, ఆరోగ్య కార్యకర్త కుల్షిద్‌బేగం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ తక్షణం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గంగాధర్ మంగళవారం తెలిపారు. స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు వద్ద నిరసన తెలిపి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలైనా భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. 12 రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు జరిగినప్పటికీ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు దీనిపై చర్చించకపోవడం సిగ్గుచేటన్నారు. తక్షణం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి జయరాం, సహాయ కార్యదర్శి జయచంద్ర, వెంకటరమణ, భాస్కర్, హరిబాబు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

గడ్డికి గడ్డు పరిస్థితి

- ఇతర ప్రాంతాల్లో అధిక రేటుకు గ్రాసం కొనుగోలు చేస్తున్న వైనం
- గడ్డిని అధికారులు అందుబాటులో ఉంచాలంటూ పాడి రైతుల విజ్ఞప్తి



ఇతర ప్రాంతాల నుంచి వరిగడ్డి కొనుగోలు చేసి తీసుకొస్తున్న పాడి రైతులు



వేల రూపాయలు పలుకుతున్న వేరుశనగ కట్టె



అరకొరగా ఉన్న నీటిని తాగుతున్న గొర్రెలు



ఎండలను తాళలేక చెట్లకిందకు చేరిన మేకలు

సంబేపల్లె : ఈ యేడు తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. చుక్క చినుకు పడకపోవడంతో గడ్డి పూస సైతం మొలకెత్తకపోవడంతో పశుగ్రాసం కోసం పాడి రైతులు, గొర్రెల కాపరులు పడరాని పాట్లు పడుతూ ఎన్నో వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు గొర్రెలు, పశువులు, మూడు లక్షలకు పైగా ఉన్నాయి. రాయచోటి పరిసర ప్రాంతాల్లో గ్రాసం అందుబాటులో లేకపోవడంతో కడప పట్టణ పరిసర ప్రాంతాల నుంచి పశువుల కోసం గ్రాసాన్ని తెచ్చుకుంటుడటంతో ధర భారంగా మారుతోంది. కొందరు పెద్ద మొత్తంలో ధరలు చెల్లించే స్తోమత లేక పాడి పశువులు, బర్రెలను పోషించడం ఎలానో అని తెలియక ఆందోళనకు గురవుతున్నారు. దీనికి తోడు పాడి రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేసి సుదూర ప్రాంతాలకు వెళ్లి ట్రాక్టర్లు, లారీల ద్వారా పశుగ్రాసం కొనుగోలు చేసుకొని తెచ్చుకుంటున్నారు. మరికొందరు పొలాల్లోనే పశుగ్రాసాన్ని కొనుగోలు చేసి వాములుగా ఏర్పాటు చేసుకొని రెండు, మూడు రోజులకోమారు తెచ్చుకొని మూగజీవాల కడుపును నింపుతున్నారు. వరిగడ్డి ట్రాక్టర్ లోడు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు, వేరుశనగ ట్రాక్టర్ లోడు రూ.35 వేల నుంచి రూ.40 వేలు వెచ్చించి కొనుగోలు చేసుకొంటున్నారు.

నీటి కోసం అవస్థలు

ఇటీవలి కాలంలో వర్షాభావం తీవ్రరూపం దాల్చడంతో మండల వ్యాప్తంగా ఎక్కడా చుక్కనీటి జాడ కనిపించడం లేదు. దీంతో మూగజీవాలను మేపుకునేందుకు వెళ్లే వాళ్లు పశువులకు నీరు అందించలేక శ్రమలు ఎదుర్కొంటున్నారు. పాడి రైతులు తమ మూగజీవాలను వలసల ద్వారా బయటి ప్రాంతాల్లో మేపుకునే పరిస్థితి దాపురించింది. పలువురు పాడి రైతులు ఏమీ చేయలేని పరిస్థితుల్లో పశువులను విక్రయిస్తున్న సందర్భాలు మండలంలో అధికంగా ఉన్నాయి. అధికారులు పశువులకు గ్రాసం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుకుంటున్నారు. అలానే గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని విన్నవిస్తున్నారు.